క్లుప్తంగా

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ



సీఎం సహాయనిధి చెక్కును బాధితునికి అందజేస్తున్న విశ్వేశ్వరరెడ్డి

విడపనకల్లు: ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన చెక్కును ఆదివారం అనంతపురంలో ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి తన నివాసంలో బాధితునికి అందజేశారు. మండలంలోని పాలికి గ్రామానికి చెందిన కె.నిరంజన్ అనే వ్యక్తికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.3.50 లక్షలు మంజూరైంది. సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరు చేయించిన విశ్వేశ్వరరెడ్డి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటానని బాధితుడు అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గాజుల చిన్న వెంకటేశులు, సర్పంచు బోయ దేవేంద్ర, అంగడి శీన, బండయ్య, బోయ గోవిందు, లోకన్న తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓగా తిప్పేస్వామి



కుందుర్పి: ఎంఈఓగా తిప్పేస్వామిని నియమించారు. ములకనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎంగా పనిచేస్తున్న తిప్పేస్వామి పదోన్నతిపై ఎంఈఓగా ఇక్కడకు బదిలీకాగా ఇక్కడ ఎంఈఓగా పనిచేస్తున్న ఓబుళపతి పెద్దపప్పూరుకు బదిలీ అయ్యారు. తిప్పేస్వామి సోమవారం బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయన స్వగ్రామం ఇదే మండలం కదరంపల్లి కావడం విశేషం.

శాస్త్రోక్తంగా పీఠాధిపతి అంత్యక్రియలు



గురుతిరుమలదాసు భౌతిక కాయం

ఉరవకొండ: మండలంలోని నింబగల్లులో సిద్ధేశ్వరస్వామి మఠం పీఠాధిపతి గురుతిరుమలదాసు(96) అనారోగ్యంతో శివైక్యం పొందారు. ఆదివారం సిద్ధేశ్వరస్వామి మఠం ఆవరణలో ఆంధ్ర, కర్ణాటక నుంచి భారీగా తరలివచ్చిన భక్తుల నడుమ శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు. 40 సంవత్సరాల నుంచి తిరుమలదాసు మఠానికి పీఠాధిపతిగా కొనసాగుతున్నారు. ఆధ్యాత్మిక బోధనలు చేస్తూ భక్తులకు సన్మార్గాన్ని బోధిస్తూ వచ్చారు. అంత్యక్రియల్లో నింబగల్లు మఠం పీఠాధిపతి సిద్ధేశ్వర స్వామి, వెలిగొండ మఠం పీఠాధిపతి గురుమహలింగప్పస్వామి తదితరులు పాల్గొన్నారు.

అంధుల జీవితాల్లో వెలుగులు



మాట్లాడుతున్న కాపు భారతి

రాయదుర్గం/టౌన్: అంధుల జీవితాల్లో శాశ్వతంగా వెలుగులు నింపాలన్నదే ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి లక్ష్యమని, ఈ కారణంగానే రెడ్ క్రాస్, బ్రాహ్మణి సోషల్ వెల్ఫేర్ సొసైటీల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాల నిర్వహణకు శ్రీకారం చుట్టామని రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి అన్నారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం శాంతిరామ్ ఆస్పత్రి(కర్నూలు) సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి, గుండె ఆపరేషన్లు, కిడ్నీ మెగా వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఊపిరి ఉన్నంత వరకు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని, ఏ అవసరం వచ్చినా అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. శాంతిరామ్ మెడికల్ టీం వైద్యుడు దాసు ఆధ్వర్యంలో 228 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 128 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. అనంతరం ఆపరేషన్లకు వెళ్లే వారిని బస్సుల్లో పంపారు. కార్యక్రమంలో శాంతిరామ్ ఆస్పత్రి సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రామేశ్వరాలయంలో అన్నదానం



అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: మండల కేంద్రంలోని రామేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉదయం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు, అర్చనలు, రుద్రాభిషేకం, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

సర్కారు సాయం.. ప్రగతికి ఊతం

- వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో రూ.3 వేల కోట్లతో సంక్షేమ కార్యక్రమాలు
- టీడీపీ హయాంలో అభివృద్ధికి ఆమడ దూరంలో నియోజకవర్గం





ఉరవకొండలో అత్యాధునికంగా నిర్మించిన వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ భవనం , రాకెట్లలో కార్పొరేట్ స్థాయిలో రూపుదిద్దుకున్న పీహెచ్‌సీ భవనం

ఉరవకొండ: గత పాలకుల నిర్లక్ష్యానికి ఉరవకొండ నియోజకవర్గం అభివృద్ధికి ఆమడదూరంగా ఉంటూ వచ్చింది. ఇక్కడ ఎమ్మెల్యేగా టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్ గెలిచినా ఏరోజూ నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టకపోవడంతో ఉరవకొండ ప్రజలు కనీస సౌకర్యాలు లేక అనేక అవస్థలు పడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉరవకొండ నియోజకవర్గానికి మహర్దశ కల్గింది. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఉరవకొండ నియోజకవర్గ సమస్యలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకెళ్లి అవసరమైన నిధులు మంజూరు చేయిస్తూ గత టీడీపీ హయాంలో జరగని అభివృద్ధిని కేవలం నాలుగేళ్లలో చేసి చూపించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఆయా శాఖల మంత్రులు, ఉన్నతాధికారులను అమరావతిలో పలుమార్లు కలిసి, నిధులు మంజూరు చేయించి నియోజకవర్గ అభివృద్ధికి బాటలువేశారు.

నాలుగేళ్లలో రైతులకు లబ్ధి ఇలా..

- రైతు భరోసా, పీఎం కిసాన్ కింద 52,972 మంది రైతులకు రూ.268.52 కోట్ల లబ్ధి
- వైఎస్సార్ సున్నా వడ్డీ కింద 19,267 మంది రైతులకు రూ.7.52 కోట్లు జమ
- వైఎస్సాఆర్ ఉచిత బీమా కింద 88,757 మంది రైతులకు రూ.159.24 కోట్ల లబ్ధి
- ఇన్‌పుట్ సబ్సిడీ కింద 24,594 మంది రైతులకు రూ.34.91 కోట్ల మంజూరు
- సబ్సిడీ విత్తనకాయల కోసం 1,19,102 మంది రైతులకు రూ.30.57 కోట్ల వ్యయం
- వ్యవసాయ ఉచిత విద్యుత్‌తో 12,258 మంది రైతులకు లబ్ధి

సంక్షేమ పథకాల వ్యయం ఇలా:

- వైఎస్సార్ పింఛన్ కానుక కింద 42,972 మందికి రూ.505.27 కోట్ల పంపిణీ
- జగనన్న చేదోడు కింద 1814 మందికి రూ.5.22 కోట్ల లబ్ధి
- వైఎస్సార్ కాపు నేస్తం కింద 888 మంది రూ.2.53 కోట్ల లబ్ధి
- ఈబీసీ నేస్తం కింద 4,884 మందికి రూ.14.20 కోట్లు జమ
- డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కింద 15,021 మందికి రూ.7.29 కోట్ల లబ్ధి
- ఎస్సీ, ఎస్టీల గృహాలకు ఉచిత విద్యుత్ కింద 3052 మందికి రూ.4.79 కోట్ల లబ్ధి
- వైఎస్సార్ సంపూర్ణ పోషణ 21,350 మందికి రూ. 43.82 కోట్ల లబ్ధి
- వైఎస్సార్ వాహన మిత్ర 725 మందికి రూ.213 కోట్లు జమ
- జగనన్న మధ్యాహ్న భోజనం ద్వారా 31,835 మందికి రూ.10.52 కోట్ల లబ్ధి
- పేదల ఇంటి స్థలాల కోసం 10,737 మందికి రూ.161.06 కోట్ల లబ్ధి
- ఇమాం, మౌజన్‌ల గౌరవ వేతనం76 మందికి రూ.3.91 కోట్లు జమ
- పాస్టర్ల గౌరవ వేతనం 55 మందికి 0.7 లక్షల లబ్ధి
- అర్చకులకు ఆర్థిక సాయం కింద 318 మందికి 0.16 లక్షలు జమ

మహిళలకు ..

- వైఎస్సార్ సున్నా వడ్డీ కింద 5,480 మందికి రూ. 27.21 కోట్ల లబ్ధి
- వైఎస్సార్ ఆసరా కింద 3,813 మందికి రూ.83.31 కోట్ల జమ
- ఎస్‌హెచ్‌జీ బ్యాంకు లింకేజీ 4941 సంఘాలకు రూ.599.21 కోట్ల రుణాలు
- వైఎస్సార్ బీమా 628 మందికి రూ.10 కోట్ల లబ్ధి
- వైఎస్సార్ చేయూత 15,215 మందికి రూ.81.15 కోట్లు జమ
- శ్రీనిధి కింద 16,139 మందికి 57.02 కోట్ల లబ్ధి
- జనన్న విద్యాకానుక కింద 28,756 మందికి 14.57 కోట్లు జమ
- అమ్మ ఒడి కింద 34,376 మంది తల్లుల ఖాతాలకు రూ.81.45 కోట్లు జమ
- మధ్యాహ్న భోజనానికి 31,835 మందికి 10.52 కోట్ల లబ్ధి
- వైఎస్సార్ నేతన్న నేస్తం 1015 మందికి రూ.7.02 కోట్లు జమ
- జగనన్న వసతి దీవెన 5,880 మందికి రూ.19.38 కోట్ల లబ్ధి
- జగనన్న విద్యాదీవెన 5,499 మందికి రూ.32.43 కోట్లు జమ
- వైఎస్సాఆర్ ఆరోగ్యశ్రీ 20,307 మందికి 44.42 కోట్ల ఖర్చు
- వైఎస్సార్ జలకళ ద్వారా 203 మందికి 1.87 కోట్ల లబ్ధి

నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు

- 251 సీసీ రోడ్లకు 1650 కోట్ల ఖర్చు
- 21 బీటీ రోడ్ల అభివృద్ధికి రూ.6564 కోట్ల ఖర్చు
- నాడు–నేడు కింద 118 ప్రభుత్వ పాఠశాలల్లో 2631.89 లక్షలతో అభివృద్ధి
- పీహెచ్‌సీల అభివృద్ధికి రూ.239 కోట్లు
- ఆర్‌బీకే, సచివాలయలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు నిర్మాణానికి 4935.4 కోట్ల ఖర్చు
- గడప గడపకూ మన ప్రభుత్వం కింద రూ.520.లక్షలతో అభివృద్ధి పనులు

సీఎం జగన్ సహకారంతోనే అభివృద్ధి



రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పేదల జీవన ప్రమాణాలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మెరుగుపరిచారు. నాలుగేళ్లలో సీఎం జగన్ సహకారంతో దాదాపు రూ.3 వేల కోట్లు నియోజకవర్గానికి వివిధ సంక్షే పథకాలు, అభివృద్ధి పనుల ద్వారా ప్రభుత్వం ఖర్చు చేసింది. ఎక్కడా పైసా అవినీతికి తావు లేకుండా ప్రజల ఖాతాలకే నేరుగా ప్రభుత్వం సంక్షేమ లబ్ధి జమ చేస్తోంది. బెళుగుప్ప మండలం జీడిపల్లి ముంపు గ్రామానికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద నిర్వాసితులకు పరిహారం రూ.82 కోట్ల మంజూరుకు ప్రభుత్వం పరిపాలన పరమైన అనుమతులు ఇచ్చింది. ఆమిద్యాల-రాకెట్ల లిఫ్ట్ నిర్మాణ పనుల్లో భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం త్వరలోనే పరిహారం అందిస్తుంది. జిల్లాలోనే ఒక్క ఉరవకొండ నియోజకవర్గానికి 26 వేల పక్కా ఇళ్లు ప్రభుత్వం మంజూరు చేసింది.

– వై.విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఉరవకొండ

నేడు ‘గడప గడపకూ మన ప్రభుత్వం’

రాయదుర్గం: డి హీరేహాళ్ మండలంలోని హొసగుడ్డంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి ఆదివారం తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు హాజరు కావాలన్నారు.

బెళుగుప్ప: మండలంలోని దుద్దేకుంట గ్రామ సచివాలయ పరిధిలో సోమవారం ఉదయం 8.00 గంటలకు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ రామచంద్ర, ఎంపీపీ పెద్దన్న, జెడ్పీటీసీ సభ్యురాలు మమత, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, సర్పంచ్ రత్నమ్మ, పార్టీ మండల కన్వీనర్ శ్రీనివాస్‌లు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు హాజరు కావాలన్నారు.

‘జగనన్న ఆణిముత్యాలు’కు నేడు అవార్డులు

రాయదుర్గం: జగనన్న ఆణిముత్యాలకు ఎంపికైన విద్యార్థులకు పట్టణంలోని మోడల్‌స్కూల్ ఆవరణలో సోమవారం ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి చేతుల మీదుగా అవార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ ముస్తాక్ ఆదివారం తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, పార్టీ ముఖ్యనాయకులంతా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

కూడేరు: మండలంలోని అరవకూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత చిన్న మలోబులు ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ దేవా తదితరులు మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

యోగా దినోత్సవం విజయవంతం చేయండి

ఉరవకొండ: ఈనెల 21న జాతీయ యోగా దినోత్సవం విజయవంతం చేయాలని ఉరవకొండ అర్బన్ సీఐ హరినాథ్, ఎంపీపీ చందా చంద్రమ్మ, ఆయూర్ ప్రతినిధి వెంకట్ కోరారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో ప్రపంచ యోగా దినోత్సవం పోస్టర్లు, కరపత్రాలను విడుదల చేశారు. ఆయూర్ ప్రతినిధి మాట్లాడుతూ ఉరవకొండ ఆధ్యాత్మిక, ధార్మిక, యోగ సంస్థల సమాఖ్య ఆయూర్ ఆధ్వర్యంలో జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తామన్నారు. ఈ నెల 20న విద్యార్థులకు యోగాపై వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు నిర్వహిస్తామన్నారు. ఉరవకొండ పోలీస్ క్రీడా మైదానంలో ఈనెల 21న సామూహిక యోగా కార్యక్రమం ఉంటుందన్నారు.



యోగా దినోత్సవం కరపత్రాలను విడుదల చేస్తున్న సీఐ, ఎస్ఐ, ఎంపీపీ

కార్యక్రమంలో ఎస్ఐ వెంకటస్వామి, జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఓబుళేష్, ఆయుర్వేదిక్ వైద్యాధికారి డాక్టర్ షఫీ, లయన్స్ క్లబ్ సభ్యుడు పీజీఎస్ నూర్‌మహ్మద్ పాల్గొన్నారు.

3న గురుపౌర్ణమి వేడుకలు

వజ్రకరూరు: మండల కేంద్రంలోని షిరిడీసాయి ఆలయంలో జూలై 3న గురు పౌర్ణమి వేడులకు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా భక్తులు మండల కేంద్రంలో రెండు రోజులుగా భిక్షాటన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో షిరిడీసాయి చిత్రపటం ఉంచి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు స్వామికి బియ్యం, బేడలు, బెల్లం తదితర వాటిని సమర్పించారు. నిర్వాహకులు మాట్లాడుతూ వచ్చే నెల 3న గురుపౌర్ణమి వేడుకలు నిర్వహిస్తామని, భక్తులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో షిరి డీసాయి సేవాసమితి సభ్యులు, భక్తులు పాల్గొ న్నారు.

అనుచిత పోస్టులు.. టీడీపీ నాయకుడి అరెస్టు

ఉరవకొండ: కూడేరు మండలం చోళసముద్రానికి చెందిన టీడీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ చంద్రబాబునాయుడును ఆదివారం గుడివాడ పీఎస్ ఎస్ఐ రమేష్ అరెస్టు చేశారు. వివరాలు ఇలా.. ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, ఆయన సోదరుడు టీడీపీ నేత పయ్యావుల శ్రీనివాసులు ప్రధాన అనుచరుడు చంద్రబాబు నాయుడు టీడీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్నాడు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు ఆయన కుటుంబ సభ్యుల పై గుడివాడకు చెందిన టీడీపీ సోషల్ మిడియా ఇన్‌చార్జ్ అసిలేటి నిర్మల పోస్టులను కూడేరు కు చెందిన చంద్రబాబు షేర్ చేసినందుకు అరెస్టు చేశామనిపోలీసులు తెలిపారు. గుడివాడ ఎస్ఐ రమేష్ తోపాటు కానిస్టేబుళ్లు కూడేరు పోలీసు స్టేషన్‌కు చేరుకుని చంద్రబాబు నాయుడును అరెస్టు చేసి గుడివాడకు తరలించారు.

కోతి దాడిలో మహిళకు గాయాలు

కూడేరు: మండలంలోని కడదరకుంటలో ఆదివారం శంకరమ్మ ఇంట్లోకి కోతులు దూరాయి. గమనించిన ఆమె కోతులు తరిమేందుకు ప్రయత్నించగా.. ఒక కోతి ఆమెపైకి ఎగిరి తలను చేతి గోర్లతో బరకడంతో గాయపడింది. ఆమెను 108లో అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు.

పురుషోత్తం భౌతికకాయానికి నివాళి



జయం పురుషోత్తం భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకుడు జయం పురుషోత్తం వైఎస్సార్ జిల్లా రాజంపేట వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆదివారం సాయంత్రం మృతదేహాన్ని స్వగ్రామం తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్, అనంతపురం ఎంపీ తలారి రంగయ్య, అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, టీడీపీ మాజీ ఎమ్మెల్యే హనుమతరాయ చౌదరి, ఇతర పార్టీ నాయకులు పురుషోత్తం భౌతికకాయానికి నివాళులర్పించి, కుటుంసభ్యులకు ధైర్యం చెప్పారు.

కుందుర్పి: జిల్లా ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు జయం పురుషోత్తం ఆకస్మిక మృతి ఆర్యవైశ్య సంఘానికి తీరని లోటని మండల ఆర్యవైశ్యులు అన్నారు. ఆదివారం స్థానిక కన్యకాపరమేశ్వరి మంటపంలో పురుషోత్తం సంతాప సభ ఏర్పాటు చేసి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల సభ్యులు, వివిధ గ్రామాల ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆర్థికసాయం అందజేత

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలో నాయీ బ్రాహ్మణుడు శ్రీనివాసులుకు అండగా నాయీ బ్రాహ్మణ సంఘం నిలిచింది. శ్రీనివాసులు నెలక్రితం గుండె ఆపరేషన్ చేయించున్నాడు. విషయం తెలుసుకున్న నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు ఆదివారం బాధితుడి కుటుంబాన్ని పరామర్శించారు. రూ.10,500 ఆర్థిక సాయం అందించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు మల్లికార్జున, యోగానంద, మోహన్‌ప్రకాష్, రవి, జమునాథ్, వీరేష్, చాపిరి వెంకటేశులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులున్న లబ్ధిదారులకు అడ్వాన్స్

కూడేరు: ప్రభుత్వం తరుపున పక్కా ఇళ్లు మంజూరై ఆర్థిక ఇబ్బందులతో పునాది తవ్వకుని, బేస్ మట్టం పూర్తై గోడలు కట్టుకోని లబ్ధిదారులకు ప్రభుత్వం అడ్వాన్స్‌గా రూ.20 వేలు ఇవ్వనున్నట్లు హౌసింగ్ ఏఈ శేఖర్ ఆదివారం తెలిపారు. మండలంలో పునాది తవ్వుకోనివారు 212, బేస్ మట్టం కట్టుకున్న వారు 291 మంది ఉన్నారన్నారు. వీరంతా సోమవారం నుంచి సమీపంలో ఉన్న సచివాలయాల్లో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకుని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఈ సూచించారు.

ఘనంగా అమావాస్య పూజలు

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని వీరభద్ర స్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామికి ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చన, రుద్రాభిషేకం, హోమం, ఆకుపూజ చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అలాగే నేమకల్లు అంజన్నకు ఆదివారం అమవాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలకరించారు. ప్రధాన అర్చకుడు అనిల్‌కుమార్ స్వామి ఆధ్వర్యంలో పురోహితులు వేకువజామునుంచే స్వామికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, విశేష వెండి తమలపాకు అలంకరణ, అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

పత్తికి నిప్పు

గుమ్మఘట్ట: మండలంలోని ఎస్.కొత్తపల్లి గ్రామంలో కె. గంగాధర అనే వ్యక్తి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు పత్తికి నిప్పంటించారు. బాధితుడి వివరాల మేరకు.. గంగాధర ఐదు ఎకరాల్లో బోరు కింద పత్తి పంటను సాగు చేశాడు. ఇటీవల పత్తిని విడిపించి ఇంట్లో భద్రపరుచుకున్నాడు. ఆదివారం గుర్తుతెలియని వ్యక్తులు పత్తికి నిప్పంటించారు. చుట్టుపక్కలవారితో కలసి బాధితుడు మంటలను నీటితో అర్పివేశారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపాడు. అధికారులు స్పందించి పరిహారం అందించాలని బాధితుడు కోరాడు.

అర్హులందరికీ రేషన్ పంపిణీ

కూడేరు: అరవకూరులో ఎండీయూ సమస్య ఉండడంతో ప్రజలు రేషన్ కోసం ఇబ్బంది పడకుండా ఉండేందుకు సీఎస్‌డీటీ లక్ష్మీదేవి , వీఆర్వో క్రిష్ణవేణి వేలిముద్ర ఆధారంగా ఆదివారం కార్డుదారులకు బియ్యాన్ని పంపిణీ చేశారు. కార్డుదారులెవ్వరూ ఆందోళన చెందవద్దని, అందరికి రేషన్ సరుకులు అందేలా చర్యలు చేపడతామని సీఎస్‌డీటీ తెలిపారు.

నేడు ‘స్పందన’

వజ్రకరూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ అనిల్‌కుమార్ ఆదివారం తెలిపారు. మండలస్థాయి అధికారులంతా తప్పక హాజరు కావాలన్నారు. మండలంలోని ప్రజలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి

కళ్యాణదుర్గం: బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సేవలు మరువ లేనివని లేబర్ ఆఫీసర్ సత్యనారాయణ అన్నారు. శెట్టూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తూ ఇటీవల బదిలీ అయిన 40 మంది ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు, జిల్లా అధ్యక్షుడు వెంకటేశులు, గౌరవాధ్యక్షుడు ప్రభాకర్, గౌరవ సలహాదారుడు బీ వెంకటేశులు, మండల ప్రధాన కార్యదర్శి మురళి, రాష్ట్ర కౌన్సిలర్ టి.క్రిష్ణ ఆధ్వర్యంలో కళ్యాణదుర్గం పట్టణంలోని వివేకనంద డిగ్రీ కళాశాలలో ఆదివారం సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు రాయల్ వెంకటేశులు, చిత్తయ్య, మంజుల, రవిశంకర్, లలితమ్మ, ధనుంజయ్య, లక్ష్మి, మనోహర్, శివన్న, విష్ణు తదితర ఉపాధ్యాయులను వారు ఘనంగా సత్కరించారు.